క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. చంపాపేట, సుల్తానాఅల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాయిరాం నగర్, ఆర్‌టీసీ, ప్రెస్ కాలనీ, నాగార్జున, పటేల్‌నగర్, కేశవనగర్, ఎస్‌ఎస్‌రెడ్డి, కటకోనికుంట, చంపాపేట పాత బస్తీ, నేతాజీ నగర్, రాజిరెడ్డినగర్, బృందావన్, బాలాజీనగర్ కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు. మారుతీ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు న్యూమారుతీనగర్, సామసరస్వతీ, పద్మానగర్, క్రాంతినగర్, కర్మన్‌ఘాట్, మైత్రిపురం, శుభోదయ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈఈ వివరించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి కోరారు. కంటివెలుగు రెండవ దశ ప్రారంభించినప్పుడు కేంద్రాన్ని ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సుబ్రమణ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేశారు. ఆ కేంద్రం తమకు దూరంగా ఉందని డీఎస్‌నగర్‌వాసులు విజ్ఞప్తి చేయడంతో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి అధికారులతో చర్చించి బస్తీలో కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ఆ కంటివెలుగు కేంద్రాన్ని సోమవారం మధుకర్‌రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి వెళ్లి పరిశీలించారు. వారికి కేంద్రంలోని వైద్యబృందం కంటి పరీక్షలు నిర్వహించారు. తాము కోరిన వెంటనే తమ బస్తీలో కంటివెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేయించిన కార్పొరేటర్‌కు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు శరత్‌చంద్రగౌడ్, లక్ష్మీనారాయణ, వెంకట్, సాయినాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ



నాగోలు: రాజస్థాన్‌లోని ప్రసిద్ధ అజ్మీర్ షరీఫ్ దర్గాను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా కుటుంబ సభ్యులతోసహా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాకు చాదర్‌ను సమర్పించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్‌గుప్తా కుటుంబ సభ్యులకు దర్గా కమిటీ నిర్వాహకులు సంప్రదాయ పద్ధతుల్లో ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉప్పల స్వప్న, కుమారులు సాయి కిరణ్, సాయి తేజ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

హయత్‌నగర్: వినియోగదారులకు గంజాయిని అమ్మేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో నివసించే కాటి చంద్రమోహన్ లారీ డ్రైవర్. కొంత కాలంగా భద్రాచలం ప్రాంతం నుంచి లారీలో ఇసుకను తీసుకొస్తూ వెంట గంజాయినీ తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రావినారాయణరెడ్డి కాలనీ సమీపంలో తనిఖీ చేస్తుండగా చంద్రమోహన్ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా 2 కిలోల గంజాయి బయటపడింది. భద్రాచలం ప్రాంతంలోని గుర్తు తెలియని వ్యక్తి దగ్గర రూ. 5 వేలకు గంజాయిని కొని ఇక్కడ అమ్మేందుకు ప్రయత్నించినట్లు తేలింది. నిందితుడి అరెస్ట్ చేసిన పోలీసులు అతని వద్ద ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం

సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ (ఫైల్)

కాలనీలు, బస్తీల్లో మెరుగైన వసతులు కల్పించి.. సమస్యలను పరిష్కరించి సైదాబాద్ డివిజన్‌ను ప్రగతిపథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. నిత్యం ఏదో ఒక కాలనీ, బస్తీల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం అని అన్నారు. రాజకీయాలు, కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంటూ కార్పొరేటర్‌గా వారికి సేవలు అందించడం ఆనందంగా ఉందని కార్పొరేటర్ సంతోషం వ్యక్తం చేశారు. సైదాబాద్ కార్పొరేటర్‌గా రెండేళ్ల పదవీకాలన్ని పూర్తి చేసుకున్న ఆమె రెండేళ్లులో డివిజన్ అభివృద్ధికి చేసిన కృషి, రానున్న రోజుల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ...

-సైదాబాద్



కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి

ప్రశ్న: ఎన్నికల హామీలు నెరవేర్చారా?

జవాబు: జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయానికే సైదాబాద్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై అవగాహన ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 60 శాతం నెరవేర్చా. 2021లో రూ. 2,49,55,000 జీహెచ్‌ఎంసీ నిధులతో 37 పనులు పూర్తి చేసాం. 2022లో రూ. 8,74,38,800 వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం.

ప్రశ్న: ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: కాలనీలు, బస్తీల్లో దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన వాటర్ పైప్‌లైన్‌లు, సెవరేజ్ పైప్‌లైన్‌లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తాం. సైదాబాద్ ప్రధాన రహదారిపై చేపల మార్కెట్ వద్ద నిత్యం మురుగు ప్రవహించేది. అక్కడి సమస్యను పరిష్కరించాం. భారీ వర్షాలు పడితే శంకేశ్వరబజార్, సాయిరాం కాలనీ ప్రాంతాలు నీట మునిగేవి. ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. ఐఎస్‌సదన్ డివిజన్ నుంచి నిర్మిస్తూ వస్తున్న బాక్స్‌డ్రెయిన్ సైదాబాద్ శంకేశ్వరబజార్ మసీదు వెనుకనున్న ఈ ఓపెన్‌నాలకు అనుసంధానం చేస్తున్నారు. అక్కడ రెండవ దశ బాక్స్‌డ్రెయిన్ పనులు నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

ప్రశ్న: తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

జవాబు: సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న సక్సెస్ స్కూల్ నుంచి మాతృశ్రీ కాలనీ వరకు రెండు సంవత్సరాలుగా తాగునీటి సరఫరా జరగటం లేదు. అధికారులతో చర్చించి అక్కడ నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాం. పూసలబస్తీలోని కొన్ని ఇళ్లకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారికి రోజు విడిచి రోజు తాగునీరు వచ్చేలా ఏర్పాట్లు చేయించాం. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రెషర్ సరఫరా, కలుషిత సరఫరా జరుగకుండా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: సైదాబాద్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య ఎప్పుడు తొలుగుతుంది?

జవాబు: నల్లగొండ చౌరస్తా నుంచి ఒవైసీ చౌరస్తా వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా సైదాబాద్ ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్టీల్ బ్రిడ్జ్ పనులను వేగవంతం చేసి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఇప్పటికే పలుమార్లు కోరాం. సైదాబాద్‌లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునికీకరిస్తున్నాం. అవసరమైన చోట వీడీసీసీ, సీసీ, బీటీ రహదారులు నిర్మించాము. తద్వారా వాహనదారులు ఇబ్బందులు లేకుండా ప్రయాణించగలుగుతున్నారు.

ప్రశ్న: రానున్న రోజుల్లో వేటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు ?

జవాబు: కాలనీలు, బస్తీలోని పలు కమ్యూనిటీ హాళ్లను ఇప్పటికే ఆధునికీకరించాము. పలు కమ్యూనిటీ హాళ్లల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఎల్‌సీహెచ్ చిన్న కాలనీ కమ్యూనిటీ హాల్, హరిజన బస్తీ కమ్యూనిటీ హాల్‌లో వసతులు మెరుగు పరచాలి. ఆయా ప్రాంతాల్లోని యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు కమ్యూనిటీ హాల్‌లు ఉపయోగపడుతాయి. వాటిలో అన్నిరకాల వసతులు కల్పిస్తే అవి రీడింగ్ రూమ్‌లుగా వారికి ఉపయోగకరంగా ఉంటాయి. అందుకే రానున్న రోజుల్లో కమ్యూనిటీ హాళ్ల ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇస్తా.

ప్రశ్న: ఎమ్మెల్యే, అధికారుల సహకారం ఎలా ఉంది?

జవాబు: మలక్‌పేట ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు చక్కగానే సహకరిస్తున్నారు. వారు మరింత సహకరిస్తే సైదాబాద్ డివిజన్ అభివృద్ధి వేగవంతంగా సాగుతుంది.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్

నాగోలు: మద్యం సేవించి ఆ మత్తులో వాహనాలు నడపడం తమతోపాటు ఎదుటి వారికీ ఎంతో ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఎస్‌పీఓలు అమరవర్ధన్‌రెడ్డి, అల్లూరయ్య పేర్కొన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 66 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాల దృశ్యాలను ప్రదర్శించారు. ముడు విడతలుగా కౌన్సెలింగ్ చేశారు. మద్యం తాగి వాహనాలు పడిపే వారు ప్రమాదాల బారిన పడితే కుటుంబం రోడ్డు పాలయ్యే దుస్థితి ఎదురువుతుందని గుర్తు చేశారు. మద్యం తాగి వాహనాలు నపడకూడదని మానసికంగా సిద్ధం కావాలని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల క్షేమాన్ని కోరే వారు మద్యం తాగి వాహనాలు నడపరని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు పడిపేవారు ప్రమాదాలకు కారణమై ఏ మాత్రం సంబంధం లేని వారి జీవితాలోనూ విషాదం నింపుస్తారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, సీటు బెల్టు, హెల్మెట్ పెట్టుకోవడం తదితర నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. ఆ తర్వాత మద్యం సేవించిన వారి కుటంబ సభ్యులతోనూ మాట్లాడారు. ప్రముఖుల సందేశాలను, సందేశాత్మక గీతాలనూ, రోడ్డు ప్రమాదాల దృశ్యాలనూ, సీసీ ఫుటేజీల్లో నమోదైన వాహనాలు నడిపే తీరునూ ప్రదర్శించారు. వాహనాలను నడిపే వేళ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వారు గుర్తు చేశారు. ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ పెట్టుకోకుంటే అనుకోకుండా ప్రమాదాలకు గురైనప్పుడు తీవ్రగాయాలైన సంఘటనలు ప్రదర్శించారు. టీటీఐ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆందోళన

హయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఏమ్మార్పీస్ పిలుపు మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్‌లో జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎల్‌బీనగర్ ఇంచార్జి బత్తిన సుధాకర్ మాదిగ మాట్లాడతూ... ఎస్సీ వర్గీకరణ చేపడతామని కేంద్ర ప్రభుత్వం పలుమార్లు అనేక వేదికలపై హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఈ సమావేశాల్లో అయినా వర్గీకరణ బిల్లును పెట్టి ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు పలువురు నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నేతలు నాగభూషణంమాదిగ, చిప్పలపల్లి సోమశేఖర్, జేపీ లతమాదిగ, బొర్ర రవిమాదిగ, కమలాకర్‌మాదిగ, సురేష్‌మాదిగ, రాజశేఖర్‌మాదిగ, రామకృష్ణమాదిగ, శోభ మాదిగ, చిరంజీవి మాదిగ, ప్రమోద్‌మాదిగ, కమలాకర్‌మాదిగ పాల్గొన్నారు.



విద్యార్థులు వినయాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ

హస్తినాపురం: విద్యతోపాటు వినయాన్ని అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తారని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌లోని పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతోపాటు విజ్ఞానం, వినోదం అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ఎంతవరకు స్వేచ్ఛ ఇవ్వొచ్చు... ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా చూస్తూ ఎలా సద్వినియోగం చేసుకోవచ్చు అనే విషయాలను ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ వై.వెంకటేశ్ మాట్లాడుతూ... తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలు, వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో అందరినీ అలరించారు.

కాలనీల్లో వసతులు కల్పిస్తా...

సైదాబాద్: ఐఎస్‌ఎదన్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆమె పూర్ణోదయకాలనీలో మార్నింగ్‌వాక్‌లో కాలనీవాసులను కలిశారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర మాట్లాడుతూ... సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. బీజేపీ నాయకులు వీరేంద్రబాబు, శరత్‌చంద్రగౌడ్, నేతలు శ్రీధర్‌రెడ్డి, అమ్రేష్‌రెడ్డి, శశిధర్ పాల్గొన్నారు.

బీజేపీ కుటిల రాజకీయాలను వీడాలి

- బీఆర్‌ఎస్ పాలనలోనే మెరుగైన ఉద్యోగావకాశాలు
- బీజేపీ కార్పొరేటర్లు పాజిటివ్‌గా ఆలోచించాలి
- అభివృద్ధి, ఉపాధిని గుర్తించాలి
- బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ల హితవు



సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు

లింగోజిగూడ: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న వారిని వీలైతే పార్టీలకు అతీతంగా అభినందించాలే తప్ప వారిపై ఆరోపణలు చేయడం తగదని బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్, కొప్పుల విఠల్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్‌లు పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈ నెల 11వ తేదీన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో సుమారు 6 వేల మందికి ఉద్యోగాలు రాగా, మరో 15 రోజుల్లో మరో 7 వేల మందికి ఉగ్యోగాలు రానున్నాయని వెల్లడించారు. నిరుద్యోగుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసి 108 కంపెనీలను ఒప్పించి ఎంతో మందికి ఉద్యోగావకాశాలను కల్పించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభినందించాల్సిన బీజేపీ కార్పొరేటర్లు తమ స్వార్థ రాజకీయల కోసం ఆరోపణలు చేస్తూ కుటిల రాజకీయాలకు పాల్పడటం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. ఎనిమిదేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కలిపిస్తానని చెప్పి ఉన్న ఉద్యోగాలని ఊడదీశారని అన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ఉద్యోగులను రోడ్డున పడేశారని ధ్వజమెత్తారు. 16 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం 16 ఉద్యోగాలనుకూ ఇవ్వలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట ప్రభుత్వం, ఎమ్మెల్యే గురించి మాట్లాడే స్థాయి బీజేపీ నాయకులకు లేదని అన్నారు. ఓ వైపు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ... మరోవైపు జాబ్ మేళాలతో ప్రైవేట్ కంపెనీల ద్వారా ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నారమన్నారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి మొదటి నెల జీతం రాగానే వారి కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తామని తెలిపారు. జాబ్‌మేళాపై శ్వేతపత్రం అడిగిన బీజేపీ కార్పొరేటర్లు ఆత్మీయ సమ్మేళనానికి వచ్చి ఉద్యోగాలను పొందినవారితో మాట్లాడి నిర్ధారణ చేసుకోవాలని హితవు పలికారు. ఇకనైనా బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయడంమాని ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ డివిజన్‌ల అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి, ముదుపు రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రఘుమారెడ్డి, కృష్ణమాచారి

చంపాపేట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రూ. 3.38 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో చేపట్టనున్న పనులకు సోమవారం ఆయాకాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. దుర్గాభవానీ నగర్, పవన్‌పురి, బంగారు ఎన్‌క్లేవ్ కాలనీలలో సీసీ, బీటీ రోడ్ల, మారుతీనగర్, సుల్తానాఅల్వా, రాజిరెడ్డి నగర్ కాలనీలలో భూగర్భ డ్రైనేజీ విస్తరణ, కర్మన్‌ఘాట్ తెలంగాణా ఫార్మసీ నుంచి సుమంగళి ఫంక్షన్ హాల్ వరకు భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన పనులకు ఆయా కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కాలనీవాసులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మారుతీనగర్, సామసరస్వతీ కాలనీ అధ్యక్షుడు నల్లా రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి మాట్లాడుతూ... గతంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందు వల్ల ఆయన శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొనలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు జగదీష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, కొత్తపేట ప్రభాకర్, జంగయ్య, శేఖర్‌రెడ్డి, రమాదేవి, అనసూయ, గోకుల సరోజ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై బాలలకు అవగాహన



బాలలకు సూచనలిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సైదాబాద్: అందరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. జువైనల్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ రాధిక ఉత్తర్వుల మేరకు సోమవారం సైదాబాద్‌లోని జువైనల్ హోంలోని బాలలకు ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులు అందరూ ట్రాఫిక్ సిబ్బంది ఆదేశాలు పాటిస్తూ వారికి సహకరిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ పొందవచ్చన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ఇతల వాహనాలకు ఆటంకం కలిగించకుండా డ్రైవింగ్ చేయాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి చట్టప్రకారం అందుకు తగిన జరిమానాలు, శిక్షలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో హోం సూపరిండెంట్‌లు సయ్యద్ అఫ్జల్, నవీన్‌కుమార్, రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్రొబేషన్ రవికుమార్, జేజేబీ మెంబర్ వాసు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి 'ఆయుష్మాన్ భారత్' భరోసా



బీమా నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం దేశంలోని ప్రజల ఆరోగ్యానికి భద్రత అని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కర్మన్‌ఘాట్ వార్డు కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా నమోదు సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్ బీమాలో పేరు నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రులలో కూడా వైద్య సేవలు పొందవచ్చన్నారు. డివిజన్ స్థాయిలోని బీజేపీ శక్తి కేంద్ర ఇంచార్జిలు, బూత్ కమిటీ సభ్యులు ప్రతి కాలనీలోని పేదింటి కుటుంబీకులను ఆరోగ్య బీమాలో పేరు నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు లింగాల దశరథ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్, సాయిప్రసాద్, అమిత్, సుమిత్ పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీదే గెలుపు: కాసం వెంకటేశ్వర్లు



కార్యక్రమంలో పాల్గొన్న కాసం వెంకటేశ్వర్లు, సామ రంగారెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్టంలో బీజేపీ గెలుపునకు దోహదపడతాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వనస్థలిపురంలో నిర్వహించిన ప్రజల గోస-బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని ఆరోపించారు. పది మంది కార్పొరేటర్లను గెలిపించుకున్న నియోజకవర్గ ప్రజలు బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... డివిజన్ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, నూతి శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, క్రాంతి గౌడ్, చిన్న యాదవ్ పాల్గొన్నారు.

ఆర్టిస్టి క్లిక్ ది ప్రీ స్కూల్లో ఫ్లేమ్‌లెస్ కుకింగ్ పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: కొత్తపేటలోని ఆర్టిస్టి క్లిక్ ది ప్రీ స్కూల్‌లో ఫ్లేమ్‌లెస్ కుకింగ్ పోటీలను నిర్వహించారు. ఈపోటీలో చిన్నారుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల కూరగాయలతో నిప్పు లేకుండా వంటకాలను చేశారు. ఇందులో ప్రతిభకనబర్చిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను పాఠశాల ఫౌండర్, ప్రిన్సిపాల్ ఎం.నీలిమ అందజేశారు. ఈ సందర్భంగా ఎం.నీలిమ మాట్లాడుతూ.. ఫ్లేమ్ లెస్ కుకింగ్‌తో చేసిన వంటకాలు తినడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్ననాటి నుంచే విద్యార్థులకు ఎంతో విజ్ఞానం, నైపుణ్యత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో-ఫౌండర్ చక్రీ జాక్సన్, ఉపాధ్యాయలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులతో స్కూల్ ఫౌండర్ ఎం.నీలిమ, కో-ఫౌండర్ చక్రీజాక్సన్ తదితరులు